# నిశ్శబ్దంగా అర్థం చేసుకొన్నారు

శ్రీమతి ఆచిలదల్లాఘం



తలుపు తెరుస్తూనే మ్రాన్పడిపోయింది.

చైతన్యమే నశించింది. సర్వలోకమూ శూన్యమై, కటికచీకటై, ఆ చీకట్లో ఆ రెండుకళ్ళూ మాత్రమే ప్రకాశిస్తున్నాయి—

ఆమె సంభ్రమానికి చకితుడయ్యాడు—అమాయకంగా దిగ్భ్రమతో నిండిన ఆ కనుల లోతు అతనికి అందలేదు—అరవాలిన ఆ కనులలోని అందాలు మాత్రమే గతంలోని అనుభూతులను, స్ఫురణకు తేగా, చిరునవ్వుతో "నేను వచ్చాను" అన్నాడు—

ఆ కంఠస్వరానికి ఆమె ఈ లోకంలోకి వచ్చింది. నెమ్మదిగా అడుగులు వెనకకువేస్తూ "రా!" అంది. కూర్చున్నాడు—

ఆమె తల వంచుకుని ఎదురుగా నిల్చుంది.

మాటలే కరువైనాయి. తలఎత్తి ఎదురుగా చూడటానికికూడా భయం—

భయమా? కాదు— చూడాలనే బలీయమైన కాంక్షని అణచివేస్తూ తన తలని పైకి ఎత్తనీయని ఈ భావానికి ఏమని పేరుపెట్టాలో?

"నువ్వు ఇలా అవుతావనుకోలేదు"—

**శారద కనులలో సుడులు తిరుగుతున్న నీరును చూసి వాసు అదిరి పడ్డాడు. అప్పటికైనా అతడు ఆమెను అర్థం చేసుకున్నాడా?**

అతని సానుభూతి—ఆమె తెల్లనివస్త్రాలు అతని హృదయాన్ని కలచి వేసాయి. ఏదో ఆశతో ప్రతీక్షతో ఆమె కనులలోకి చూశాడు—ఆ చూపు లామెహృదయానికి గుచ్చుకొన్నాయి. ప్రయత్నంమీద కనులను ప్రక్కకు త్రిప్పింది.

"అవును! చాలా ఆలస్యంగా వచ్చావు—"

ఈ మాట లతనికి కొరడాదెబ్బలు—తల ఎత్తలేని సవాలు— తనలో దాగిన పిరికితనాన్ని వెక్కిరిస్తున్నాయి—

అతని చెక్కిళ్ళు ఎర్రనయ్యాయి. రోషాన్ని అణచుకుంటూ, తల పైకెగురవేసి "దయచేసి గతాన్ని తవ్వకు—"అన్నాడు—జాలిగా ఆమె ముఖం లోకి వెతుక్కుంటున్నట్లు చూశాడు—

ఆమెమూర్తి గంభీరమయింది. స్థిరంగానే సమాధానమిచ్చింది.

"ఆ ఉద్దేశం నాకు లేదు. నే నెప్పుడూ వర్తమానంలోనే జీవిస్తాను"—

అతనికి సరిగా అర్థంకాలేదు—

తన ఎదురుగా విరాగినిలానిలుచున్న ఆ తరుణిలో అలనాటి పదహారేళ్ళ చిలిపిమరదలి ఆకారమే అతనికి కన్పిస్తూంది—

ఒక్కసారి ఆమెను తనహృదయానికి గాఢంగా హత్తుకుని తనలో లీనం చేసుకోవాలన్నంత ప్రబలమైన ఆవేశం కలుగుతూంది.

అయినా ఆమె తనచుట్టూ తానేదో గిరిగీసు కుని నిలబడినట్లూ ఆ గిరి తాను దాటలేనట్లూ భావన కలుగుతూంది.

"కొంచెం మంచినీళ్ళియ్యి శారదా!"

చివరకు మాట్లాడగలిగిం దతి. దాహమయి కాదు—అంతకంటె ఏం మాట్లాడాలో తెలియక—ఆ వంకతోనయినా తనకు దగ్గిరగా వస్తుంది కదా అన్న ఆశతో—

ఆమెచేతి వేళ్ళను కావాలనే తాకుతూ మంచి నీళ్ళందుకున్నాడు—

శారద అలవోకగా నవ్వుకుంటూ తన చేతిని వెనక్కు తీసుకుంది—

మట్టిగాజులకు నోచుకోని ఆమె పచ్చని చేతి మీద బంగారుగాజులు తళుక్కుమన్నాయి. ఆ సన్నని వేళ్ళు ఒకనాడు తనజుట్టుతో అప్యాయంగా ఆడుకున్నాయన్న స్మృతి అతనిహృదయంలో చెయ్యిపెట్టి కెలికినట్లయింది—

ఆపరాని కాంక్ష అతనికళ్ళలో వెలిగింది.

ఒక అడుగు ముందుకు పడింది.

కాని, శారదకళ్ళు అతని నక్కడే ఆపేశాయి.

"కూర్చో బావా!" అతని ప్రయత్నం గమనించి శారద ప్రశాంతంగా అంది.

అత వింక సాహసించలేకపోయాడు. అయినా శారద కంఠస్వరమూ, ఆమె మూర్తీ, అతనికి పదేపదే ఎవరో శారద తనదేనని చెప్పినట్లయింది.

లోకంలో సర్వసాధారణంగా జరిగే విషయమే శారదవిషయంలోనూ జరిగింది.

శారద కలవారింటిబిడ్డ కాదు. ఆ కారణం గానే స్వంత మేనత్తకొడుకైనా వాసుని పొంద లేకపోయింది — ఊహలు తెలిసిననాటినుండి పెనవేసుకున్న మమతలూ, అనుబంధాలూ ఒకా నొక దుష్టముహూర్తంలో విచ్ఛేదమయి, ఎవరికి వారుగా, ఏమీకానివారుగా—అయిపోయారు.

అప్రయత్నంగా కొంగుతో శారద కళ్ళు తుడుచుకుంది—

అది గమనించిన వాసుమనసు ఉయ్యాల లూగింది. గబాలున అనేశాడు.

"హమ్మయ్య! నా ఉనికిని నీ మనసు ఇప్పటికి గుర్తించిందన్నమాట!—"

"బావా!" చాలాసేపటికి శారద అన గలిగింది.

"నీ ఉనికిని నాహృదయ మేనాడూ ఏ క్షణమూ మర్చిపోలేదు. అక్కడ నీ ఉనికి ఎప్పుడూ స్థిరంగానే ఉంది" వాసు సంతోషంతో తలక్రిందులయ్యాడు.

"నాకు తెలుసు శారదా! ఆ ధైర్యంతోనే ఇవాళ మళ్ళీ నీ దగ్గరకు రాగలిగాను"—

శారద సమాధానం చెప్పలేదు. కాస్త తట పటాయించి మళ్ళీ వాసే అన్నాడు—

"ఇంక నాతో వచ్చెయ్యి శారదా! అంటే నన్ను పార్థం చేసికోకు—నేను నిన్ను పెళ్ళి చేసుకుం టాను."

శారద ఉలిక్కి పడింది. ఆశ్చర్యంగా వాసు కళ్ళలోకి చూసింది.

"ఏమిటి వాసూ! ఇప్పుడా!? ఇప్పుడు నన్ను పెళ్ళిచేసుకుంటావా? మతిపోయిందా?"

"కాదు శారదా! నిజంగానే చెపుతున్నాను నువు లేకుండా బ్రతకలేను—నా మాట విను శారదా! నిండు వయసులో ఉన్నావు. జీవితాన్ని వ్యర్థం చేసుకోకు—పాతపగలు మనసులో పెట్టుకోకు"

ఆవేశంతో చెప్తున్న వాసుకు శారద మధ్య లోనే అడ్డుపడింది.

"పగా!? పగ ఎవరిమీద వాసూ? నేను హిందువుల పిల్లని. కర్మసిద్ధాంతంమీద నాకు నమ్మకం ఉంది. నా కర్మకు నేను ఎవరినీ నిందించను. ఇక నువ్వు చెప్పింది కూడా అసంభవం"

వాసు అదిరిపడ్డాడు. అతని అభిమానం గాయ పడింది.

"అసంభవమా? ఎందుకని?"

"ఎందుకేమిటి? నేను బాల్యవితంతువునా? లక్షణంగా అయిదేళ్ళు కాపురం చేశాను. ఆయన్ని మనసారా గౌరవించి ప్రేమించాను. ఆ స్మృతులు నాలో ఇంకా చెరిగిపోలేదు. ఇంకొకరి భార్యగా నన్నూహించుకోవటమే నాకు బాధగావుంది. ఆ ప్రసక్తి ఎత్తకు వాసూ!....."

శారదనోటినుండి ఈ మాటలు వినడం వాసుకి చాలా కష్టమనిపించింది. రోషంగా వెళ్ళి పోయాడు.

శారద బరువుగా నిట్టూర్చి ఒక్కసారి కళ్ళు తుడుచుకుంది—వెళ్ళిపోతున్న వాసుతో "అప్పుడప్పుడు కనిపించు బావా!" అంది.

ఆ క్షణంలో రోషంగా వెళ్ళాడేకాని, తనమనసుని నిగ్రహించుకోలేకపోయాడు. అనుక్షణమూ "ఎప్పుడైనా కనిపించుబావా!" అన్న శారద ఆహ్వానం అతని చెవులలో గింగురుమంటూనే ఉంది.

ఉండబట్టలేక మళ్ళీ శారదను కలుసుకున్నాడు. శారద ఆప్యాయంగా మాట్లాడింది. అన్నీ చేసింది. కానీ పెళ్ళిప్రసక్తి రాంగానే మూతి ముడుచుకు కూర్చుంది. ఇలా నాలుగైదుసార్లు జరిగింది. వాసు అభిమానం పూర్తిగా గాయపడింది. వాసు అవమానింపబడ్డట్లుగా భావించుకున్నాడు. ఇక శారదముఖం చూడకూడదని ఒట్టుపెట్టుకున్నాడు. ప్రలోభాలని అణచుకుని ఆ చాయలకు పోకుండా తననుతాను నిగ్రహించుకున్నాడు.

శారద ఇంచుమించు ప్రతిరోజూ వాసుకోసం ఎదురు చూస్తూనేఉంది. శ్రీరామునికోసం శబరిలా. శబరి పళ్ళూ నీళ్ళూ రోజూ సిద్ధంగా ఉంచుకుని గుమ్మంలో నిలబడిఉండేదట—ప్రతీక్షతో....

తనూ.....

రోజులూ వారాలూ నెలలూ గడిచి పోతున్నాయి. ప్రతిరోజూ శారద వాసుకోసరం ఎదురు చూస్తూనే ఉంది.

వాసు రాడు. నిరాశతో కళ్ళు మూస్తుంది.

ఒకనాడు శారదహృదయ మెందుకో కీడును శంకించింది. వాసును చూడాలనేకోరిక తీవ్రతరమైంది—వాసు రూంకి వెళ్తే!?......తన ఆలోచనకి తనే ఉలికిపడింది. గుండెలు దడదడలాడాయి.

అయినా ఆరాటాన్ని అణచుకోలేక రూంకే బయలుదేరింది.

అక్కడ కనబడిన దృశ్యానికి శారద ప్రాణ్పడి పోయింది.

గది అంతా చిందరవందరగా మురికిగా ఉంది. ఒక మాసిన పక్కమీద నీరసంగా వాసు పడుకుని ఉన్నాడు.—బహుశా ఏ జ్వరమైన వచ్చి ఉండ వచ్చుననుకుని దగ్గరకు వెళ్ళి నుదుటిమీద చెయ్యి వేసింది. నుదురు కాలిపోతోంది. ఆమె స్పర్శకు వాసు కళ్ళు తెరిచాడు—

"శారదా!" అన్నాడు ఆశ్చర్యంగా—

దాచుకోవాలన్నా దాగని ఆనందం అతని కన్నులలో కదలాడింది.

కాని వెంటనే గత స్మృతులు స్ఫురణకురాగా ముఖాన్ని గంభీరంగా మార్చుకుని "నువ్వెందుకు వచ్చా విక్కడికి?" అన్నాడు—

"నిన్ను చూడాలని" అంది శారద—

వాసు కొంచెం లేవడానికి ప్రయత్నిస్తూ శారదముఖంలోకి చూస్తూ "నన్ను చూడ

(47-వ పేజీ చూడండి)

# నిన్ను పూర్తిగా అర్థం చేసుకొన్నాను

(17-వ పేజీ తరువాయి)

టానికా? నాతో నీకేమవసరం శారదా?" అన్నాడు.

ఈ దెప్పిపొడుపు శారదమనసును కెలికినా పట్టించుకోకుండా "ఇంత జ్వరంలో నువ్విక్కడ ఉండకు—మా ఇంటికి వచ్చెయ్యి" అంది.

"రాను—ఒక్కసాటికీరాను"—మొండిగాఅన్నాడు అతని కంఠంలోని స్థిరత్వాన్ని గమనించింది శారద—ఇక అతనిని కదపటం తనవల్ల అయ్యే పని కాదనీ గుర్తించింది.

"సరే! అయితే నేనే ఇక్కడ ఉండిపోతాను" అంది స్థిరంగా.

"వీల్లేదు" విసురుగా అన్నాడు.

"నువ్వేమన్నాసరే నే నిక్కడ్నుంచి కదలను—నన్ను మెడపట్టుకుని గెంటేస్తావా?" శారద కళ్ళలో నీళ్ళుతిరిగాయి.

ఈసారి వాసు తనకంఠంలోకి కాఠిన్యాన్ని తెచ్చుకోలేకపోయాడు.

"నువ్వు నా కెవరని నాదగ్గరుంటా నంటున్నావూ? పరాయివాళ్ళచేత పనులు చేయించుకోవడం నా కిష్టంలేదు" 'పరాయి' అన్న పదాన్ని నొక్కిపలికాడు వాసు—

అతని పెంకితనానికి శారదకు నవ్వు వచ్చింది.

"నేను నీ మరదల్ని" అంది.

"ఎంత మరదలివయినా ఒకరింటి ఇల్లాలి వయినతరువాత పరాయిదాని క్రిందనే లెక్క. మరొకరిభార్య నా కెందుకు సపర్యలు చెయ్యాలి" శారదకళ్ళలోకి చూస్తూ అన్నాడు.

అతని మాటలలోని భావం శారద కర్థమయింది. క్రింది పెదవిని పళ్ళతో నొక్కి పట్టి చాలాసేపు ఆలోచించి చివరకు ఏడుస్తూ "నేను నీ దానిని బావా! నన్నిప్పుడు వెళ్ళగొట్టకు—' అంది. వాసు కొక్కసారిగా వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. శారద తలను తనచేతులతో లేవనెత్తి జ్వరంతో కాలిపోతున్న తన గుండెలమీదకు చేర్చుకున్నాడు. శారద నిశ్చింతంగా కళ్ళు మూసుకుంది.

మానసికమైన సంతోషంవలననో శారద సపర్యలవలననో వాసు తొందరగానే కోలుకున్నాడు. కానీ, ఉండుండి "అబ్బ! నీరసం" అంటాడు—శారద వెళ్ళిపోతుందేమోననే భయంతో.

ఆరోజు నిండుచంద్రుణ్ణి చూస్తూ ఆ వెన్నెలలో శారద లావణ్యాన్ని ఊహించుకుంటూ డాబా మీద కూర్చున్నాడు వాసు—అంతలోనే శారద అక్కడకు వచ్చి "మొన్ననే జ్వరంతగ్గింది ఇలా చలిగాలిలో కూర్చుంటే ఎలా బావా? క్రిందికి పద!" అంది.

ఆ క్షణంలో శారదను చూడగానే వాసుహృదయం పది వసంతాలు వెనక్కుగెంతింది.

కూర్చున్న చోటులోంచి లేచి శారద దగ్గరగా వచ్చాడు—శారద వెనక్కు తగ్గబోయి తమాయించుకుంది. వాసు హృదయారాటం ఇవన్నీ గమనించే స్థితిలో లేదు.

రెండు చేతులతోనూ శారదను దగ్గరగా లాక్కుని గాఢంగా హృదయాని కదుముకున్నాడు. ఆపలేని తమకంతో ఆమెపెదిమలను తన పెదిమలతో కలిపాడు. తన వేళ్ళతో ఆమె చిబుకాన్ని పట్టుకుని అనురాగంగా ఆమెకళ్ళలోకి చూశాడు. ఆ కనులలో సుడులు తిరుగుతున్న నీరును చూసి అదిరిపడ్డాడు వాసు—అప్రయత్నంగానే ఆమెను చుట్టిన అతని చేతులు సడలిపోయాయి. దూరంగా తొలిగి ఆమెముఖంలోకి పరిశీలనగా చూశాడు.

ఆమెలో ఏవికారమూ లేదు. చలనంలేని రాతి బొమ్మలా అర్థరహితంగా చూస్తూ అలానే నిలబడిఉంది. వాసు తలవంచుకుని గబగబ మెట్లు దిగి పోయాడు. శారద అలాగే దిగంతాలలోని శూన్యాన్ని చూస్తూ నిలబడిపోయింది.

ఆ మరునాడు వాసు ఆఫీసునుంచి ఇంటికి రాగానే దుస్తులయినా మార్చుకోకుండా శారద దగ్గరకు వచ్చి "పద శారదా! నిన్ను మీ ఇంటి దగ్గర దింపివస్తాను" అన్నాడు.

శారద ఉలికిపడి అయోమయంగా అతని వంక చూసింది—"ఏమిటి బావా?" అంది.

వాసు సాధ్యమైనంతవరకూ తనముఖంలో ఏ భావమూ కనిపించకుండా ఉండటానికి ప్రయత్నిస్తూ "ఇప్పటికే నిన్ను చాలా కష్టపెట్టాను. ఇక్కడ ఎన్నాళ్ళుండగలవూ?" అన్నాడు.

శారద భరించలేకపోయింది. చేతులలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ "ఎందుకు నన్నిలా చిత్రవధ చేస్తావు బావా? నన్నేనాటికీ అర్థం చేసికోలేవా?" అంది.

వాసుకికూడా కళ్ళు చెమ్మగిల్లాయి. శారద తలమీద చేయివేసి ఆప్యాయంగా నిమురుతూ "ఏడవకు శారదా! నేను నిన్ను పూర్తిగా అర్థం చేసుకున్నాను. అందుకనే ఇంటిదగ్గర దింపి వస్తానన్నాను. అందుకనే—పద" అన్నాడు. శారద కళ్ళు తుడుచుకుని వాసు కళ్ళలోకి చూసింది. ఇన్నాళ్ళకు తనకు కావలసింది ఆ కళ్ళలో కనిపించినట్లయింది. తనుకూడా లేచి "పద" అంది.

చవితిచంద్రుని కాంతిలో వారి నీడలు మసకమసకగా సమాంతరంగా కదిలాయి. ★

